ప్లాస్టిక్ కవర్లను నిషేధించాలి

పర్యావరణ వేత్త కోలా రవీందర్ ముదిరాజ్

జీడిమెట్ల, జనవరి 6 : పర్యావరణాన్ని దెబ్బ తీస్తున్న ప్లాస్టిక్ కవర్లను నిషేధించాలని పర్యావరణ వేత్త కోలా రవీందర్ ముదిరాజ్ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ని దెబ్బతీస్తున్న ప్లాస్టిక్ పరిశ్రమలు నాణ్యతలేని కవర్లను తయారు చేసి మార్కెట్‌లో విక్రయిస్తున్నాయని అన్నారు. అలాంటి పరిశ్రమలపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకుండా చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఫంక్షన్ హాల్స్, హోటల్స్, ఆలయాలకు నాణ్యత లేని కవర్లు ఇవ్వడంతో భవిష్యత్‌లో మనం పర్యావరణాన్ని నాశనం చేసినవారమవుతామన్నారు. ఎక్కడ చూసినా ప్లాస్టిక్‌తో నిండిపోవడంతో హైదరాబాద్‌ను చూస్తే బాధాకరంగా ఉందన్నారు. ఫంక్షన్ హాల్స్, హోటల్స్, ఆలయాలకు ప్లాస్టిక్ ఇస్తారాకులు ఇవ్వకుండా నోటీసులు ఇవ్వాలని అధికారులను కోరారు. త్వరలో జరగబోయే జాతరలో ప్రభుత్వం లక్షలాది రూపాయలు ఖర్చు పెడుతుందని, ఇందులో ఆలయ కమిటీలకు ప్లాస్టిక్ కవర్లు వాడకుండా నోటీసులిచ్చి నిరోధించాలని కోరారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన

అల్లాపూర్, జనవరి6: దశాబ్దాలుగా బస్తీ, కాలనీల్లో పేరుకుపోయిన సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించిన ఘనత ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకే దక్కుతుందని అల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ సబిహాబేగం అన్నారు. అల్లాపూర్ పరిధి సఫ్దర్‌నగర్‌లో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను సోమవారం స్థానిక నేతలతో కలసి ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సహకారంతో డివిజన్‌లో అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయని అన్నారు. పనులను వేగంగా పూర్తిచేయాలని ఆమె కోరారు.

మొక్కుబడిగా ప్రజావాణి..

- కొరవడిన ఉన్నతాధికారుల పర్యవేక్షణ..
- ఫిర్యాదులు ఇచ్చినా పరిష్కారం కాని సమస్యలు..

కేపీహెచ్‌బీ కాలనీ, జనవరి 6 : కూకట్‌పల్లి జోన్ పరిధిలో ప్రజా సమస్యలు పరిష్కరించే దిశగా చేపట్టిన ప్రజావాణిపై ప్రజల నుంచి విమర్శలు వస్తున్నాయి. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడం, కిందిస్థాయి అధికారుల నిర్లక్ష్యంతో ప్రజావాణి కార్యక్రమం తూతూ మంత్రంగా సాగుతోన్నది. ఐదు సర్కిళ్ల పరిధిలోని కాలనీలు, బస్తీలలో నివసించే ప్రజలు సమస్యల పరిష్కారం కోసం ఎంతో ఆశగా జీహెచ్ఎంసీ కార్యాలయానికి వస్తున్నా... ఇక్కడ ప్రజల ఆవేదనను వినేనాథులే కరువయ్యారు. ఒకవేళ విన్నా ఆ సమస్య పరిష్కారం అవుతుందన్న గ్యారెంటీ లేదు. ఏడాదికాలంగా జరుగుతున్న ప్రజావాణిపై వచ్చిన ఫిర్యాదులు ఎన్ని... పరిష్కరించిన సమస్యలు ఎన్ని... అనేది ఎవరికి తెలియడం లేదు. ప్రజావాణి సమస్యలను పరిష్కరించడం కోసం ఎలాంటి సమీక్షలు జరపడం లేదు. దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆ సమస్యను పరిష్కరించిన తర్వాతనే ఉన్నతాధికారులకు సమాచారం అందించాలి. కానీ.. దరఖాస్తులను పరిశీలిస్తే... చాలు ఆ సమస్య పరిష్కారం అయిందని కింది స్థాయి అధికారులు ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తున్నారు. ప్రజావాణిలో రెండు, మూడుసార్లు ఫిర్యాదు చేసినా సమస్యలు పరిష్కారం కావడం లేదని సర్వత్ర విమర్శలు వినిపిస్తున్నాయి.

కూకట్‌పల్లి జోన్ ఆఫీస్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ఇద్దరు అధికారులు

ప్రజావాణికి దూరంగా జడ్సీ..

కూకట్‌పల్లి జోనల్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణికి జోనల్ కమిషనర్ దూరంగా ఉండటం చర్చనీయంశంగా మారింది. గతంలో జోన్ ఆఫీస్ ప్రజావాణిలో జడ్సీ నేరుగా ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి... వాటి పరిష్కారం కోసం కిందిస్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేయడం జరిగేది. దీంతో ఆయా సమస్యలకు పరిష్కారం లభించేంది. కానీ... గత కొన్ని వారాలుగా జడ్సీ ప్రజావాణిలో అర్జీలు స్వీకరించడంపై ఆసక్తి చూపకపోవడంతో కిందిస్థాయి అధికారులు కూడా ప్రజావాణికి హాజరుకావడం లేదు. కేవలం టౌన్‌ప్లానింగ్, ఇంజినీరింగ్ విభాగాల అధికారులు తప్ప...మిగిలిన విభాగాల అధికారులు కనిపించడం లేదు. పలుమార్లు ఫిర్యాదు చేసినా సమస్యలకు పరిష్కారం లభించడం లేదని, ప్రజావాణిలో కూడా జడ్సీని కలిసి ఫిర్యాదు చేయడానికి అవకాశం లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జంట సర్కిళ్ల కార్యాలయంలో కూడా ఇదే తరహాలో ప్రజావాణి కొనసాగుతోంది. ఇక్కడ ప్రజావాణిలో ఒకరు, ఇద్దరు అధికారులు మా త్రమే కనిపిస్తున్నారు. ఉన్నతా ధికారులు ప్రజావాణిపై దృష్టి సారించి ప్రజా సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

కూకట్‌పల్లి జోన్‌లో 19 ఫిర్యాదులు..

కూకట్‌పల్లి జోన్ ఆఫీస్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో 19 ఫిర్యాదులు రాగా... వచ్చిన ఫిర్యాదులన్నీ టౌన్‌ప్లానింగ్ విభాగానికి చెందినవే కావడం విశేషం. కూకట్‌పల్లి సర్కిల్ కార్యాలయంలో 9 ఫిర్యాదులు రాగా...టౌన్‌ప్లానింగ్ విభాగానికి 6, శానిటేషన్ విభాగానికి 2, అడ్మినిస్ట్రేషన్ విభాగానికి 1 ఫిర్యాదు వచ్చింది. మూసాపేట సర్కిల్ కార్యాలయంలో 5 ఫిర్యాదులు రాగా... టౌన్‌ప్లానింగ్ విభాగానికి 2 ఫిర్యాదులు, శానిటేషన్ విభాగానికి 2 ఫిర్యాదులు వచ్చినట్లు జోనల్, జంట సర్కిళ్ల అధికారులు తెలిపారు.

జంట సర్కిళ్ల కార్యాలయంలో..

కుత్బుల్లాపూర్-గాజులరామారం జంట సర్కిళ్ల కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావాణి కార్యాలయంలో పలు సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను డీసీలు మల్లారెడ్డి, నర్సింహాలు స్వీకరించారు. ఈ మేరకు కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలో 11, గాజులరామారం సర్కిల్ పరిధిలో 6 సమస్యలపై ఫిర్యాదులను స్వీకరించిన్నట్లు తెలిపారు. *– కుత్బుల్లాపూర్, జనవరి 6*

జేఎన్‌టీయూహెచ్‌లో నూతన సంవత్సర వేడుకలు

జేఎన్‌టీయూహెచ్ వర్సిటీ నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ బాలకృష్ణారెడ్డి, రెక్టార్ విజయ్‌కుమార్‌రెడ్డి, రిజిస్ట్రార్ వెంకటేశ్వర్‌రావు, తదితరులు

కేపీహెచ్‌బీ కాలనీ, జనవరి 6 : జేఎన్‌టీయూహెచ్ వర్సిటీలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. సోమవారం వర్సిటీ ఆవరణలో జరిగిన వేడుకల్లో వైస్ చాన్స్‌లర్ బాలకృష్ణారెడ్డి, రెక్టార్ విజయ్‌కుమార్‌రెడ్డి, రిజిస్ట్రార్ వెంకటేశ్వర్‌రావులు కేక్ కట్‌చేశారు. అనంతరం వర్సిటీకి చెందిన క్యాలెండర్‌ను, డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వైస్ చాన్స్‌లర్ మాట్లాడుతూ... మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ సంతాప దినాల కారణంగా కొత్త సంవత్సరం వేడుకలు జరుపుకోలేదని, సోమవారం వేడుకలు నిర్వహించినట్లు తెలిపారు. వర్సిటీలో హాస్టళ్లను సందర్శించి, విద్యార్థుల సమస్యలను పరిష్కరించినట్లు తెలిపారు. అధ్యాపకుల పే రివిజన్ సం బంధించిన బకాయిలను విడుదల చేశామని, పెన్షనర్ల కోసం ప్రత్యేక వెబ్‌సైట్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. టీచింగ్, నాన్ టీచింగ్ సి బ్బంది సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానన్నారు. కార్యక్రమంలో ఆయా విభాగాల డైరెక్టర్లు, ప్రిన్సిపాళ్లు, హెచ్‌ఓడీలు, అధ్యాపకులు, కాంట్రాక్ట్ అధ్యాపకులు, నాన్ టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాను మెరుగుపర్చాలి..



ప్రజావాణిలో జలమండలి అధికారులతో మాట్లాడుతున్న శ్రీశైలంగౌడ్

జగద్గిరిగుట్ట, జనవరి 6 : బస్తీలు, కాలనీల్లో తాగునీటి సమస్య పరిష్కరించాలని మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్ సూచించారు. ఐడీపీఎల్‌లోని జలమండలి కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఆదర్శనగర్, మెట్టుకానిగూడెం, శారదాకాలనీ, కేకేఎం నగర్, రాజీవ్‌గాంధీనగర్, కళావతినగర్, శ్రీవెన్‌ఎన్‌క్లేవ్, చింతల్, సూరారంకాలనీ, జగద్గిరిగుట్ట ప్రాంతాల్లో లోప్రెషర్ సమస్య ఉందని ఆయన.. జలమండలి జీఎం అశోక్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే చర్యలు తీసుకుని సమస్య పరిష్కరించాలని కోరారు.

కుత్బుల్లాపూర్ ఓటర్ల తుదిజాబితా విడుదల

కుత్బుల్లాపూర్ ఓటరు తుదిజాబితాను సోమవారం అధికారులు వెల్లడించారు. ఈమేరకు మున్సిపల్ కార్యాలయంలో ఎలక్ట్రోరల్ అధికారి నర్సింహ వివరాలు ప్రదర్శించారు. పురుషులు 3,82,611, మహిళలు 3,51,274, ఇతరులు 166, సర్వీసు ఓటర్లు 104 మెత్తం ఓటర్లు 7,34,051 నమోదైనట్టు తెలిపారు. *– కుత్బుల్లాపూర్, జనవరి 6*

గంజాయి నిర్మూలనకు ప్రత్యేక నిఘా

శేరిలింగంపల్లి ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్ గౌడ్

మాదాపూర్, జనవరి 6: గంజాయిని అరికట్టేందుకు పటిష్ట చర్యలు చేపట్టామని ఎక్సైజ్ శాఖ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్ గౌడ్ తెలిపారు. శేరిలింగంపల్లి ఎక్సైజ్ శాఖ పోలీస్ స్టేషన్‌లో సోమవారం సిబ్బందితో కలిసి ఆయన విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ... నానక్‌రాంగూడ పరిసర ప్రాంతాల్లో గంజాయి సరఫరా, విక్రయాలు నిర్వహిస్తున్న వారిపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు తెలిపారు. యువత, ఐటీ ఉద్యోగాలు, విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసకావద్దని అన్నారు. గంజాయి విక్రయాలు జరుగుతున్న నానక్‌రాం గూడ, గచ్చిబౌలి, మాదాపూర్ ప్రాంతాల్లో ఎక్కడికక్కడ కట్టడి చేస్తున్నామన్నారు. పలు చోట్ల గంజాయి నిర్మూలనపై అవగాహన కార్యక్రమాలు సైతం చేపడుతున్నట్లు తెలిపారు. శేరిలింగంపల్లి మండల ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ స్టేషన్ పరిధిలో 2024లో 172 కేసులు నమోదు కాగా.. ఇందులో 64 కేసులు గంజాయి, 105 మంది నిందితులను అరెస్ట్ చేయగా, 41 వాహనాలు సీజ్ చేశామన్నారు. 111.822 కిలోల గంజాయి, 5.1 కిలోల గంజాయి చాక్లెట్ల, 3 గంజాయి మొక్కలు, 300 గ్రాముల ఓపీఎం, 151 గ్రాముల హెరాయిన్, 20.46 గ్రాముల ఎండీఎంఏ, 1.04 కిలోల ఓజీ కుష్, 1379 కిలోల హషిష్ ఆయిల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

నేడు వాహనాల వేలం

శేరిలింగంపల్లి మండలం ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ స్టేషన్‌లో పలు కేసుల్లో పట్టుబడ్డ వాహనాలను నేడు వేలం వేస్తున్న ఎక్సైజ్ శాఖ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్ గౌడ్ తెలిపారు. శేరిలింగంపల్లి మండల పరిధిలో గంజాయి, డ్రగ్స్ సరఫరా చేస్తూ పట్టుబడ్డ వాహనాలను మంగళవారం ఉదయం 12 గంటల నుంచి వేలం వేయనున్నట్లు తెలిపారు. ఈ వేలంలో మొత్తం 19 వాహనాలు ఉండగా, అందులో 2 కార్లు, ఆటో 1, 16 ద్విచక్ర వాహనాలు ఉన్నట్లు తెలిపారు.

ఉత్తమ లయన్ జోన్ చైర్మన్‌గా లయన్ కొండా విజయ్ కుమార్

మాదాపూర్, జనవరి 6: లయన్స్ క్లబ్ ఉత్తమ జోన్ చైర్మన్‌గా చందానగర్‌కు చెందిన కొండా విజయ్ కుమార్ ఎంపికయ్యారు. లయన్స్ క్లబ్ జోనల్ చైర్మన్‌గా పలు సేవా కార్యక్రమాలను చేపట్టడంతో మియాపూర్ విశ్వనాథ్ గార్డెన్‌లో అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా లయన్స్ రీజియన్ చైర్మన్ కరుణాకర్ గౌడ్ మాట్లాడుతూ ... లయన్స్ క్లబ్ జోనల్ చైర్మన్‌గా ఆరు నెలల క్రితం బాధ్యతలు స్వీకరించి అనతి కాలంలోనే కొండా విజయ్ కుమార్ తన సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేసిన కృషికి ఈ అవార్డును అందజేసినట్లు తెలిపారు. లయన్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ లయన్ ఘట్టమ బాబురావు చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

కౌన్సిలర్ శంభీపూర్‌కృష్ణకు సమస్యలు వివరిస్తున్న పలువురు

దుండిగల్, జనవరి 6 : ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బీఆర్ఎస్ నేత, దుండిగల్ మున్సిపాలిటీ కౌన్సిలర్ శంభీపూర్‌కృష్ణ అన్నారు. దుండిగల్ మున్సిపాలిటీ పరిధి, శంభీపూర్‌లోని కార్యాలయంలో సోమవారం నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, సంక్షేమ సంఘాల సభ్యులు, కార్యకర్తలు ఆయనను కలిశారు. ఈ సందర్భంగా తమ కాలనీలు/బస్తీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని విన్నవించారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన ఆయన ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామన్నారు. సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలన్నారు.

ఆకట్టుకున్న విద్యార్థుల నమూనాలు..

నమూనాలు పరిశీలిస్తున్న ట్రస్మా ప్రతినిధులు

జగద్గిరిగుట్ట, జనవరి 6 : చదువుకు సృజనాత్మకత జోడిస్తే భవిష్యత్‌లో నిపుణులుగా రాణిస్తారని ట్రస్మా మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు రామేశ్వర్‌రెడ్డి సూచించారు. జగద్గిరిగుట్ట శ్రీసాయివిద్యానికేతన్ హైస్కూల్‌లో సోమవారం కరస్పాండెంట్ ఆంజనేయులు ఏర్పాటు చేసిన లీడ్‌కాన్ఫరెన్స్‌ను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా విద్యార్థులు రూపొందించిన నమూనాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డైరెక్టర్ బిర్రు శోభారాణి, కుత్బుల్లాపూర్ ట్రస్మా అధ్యక్షుడు వినోద్‌జాదవ్, దయాకర్, నర్సింహులు, బాలరాజుగౌడ్, వీరన్న. ఫాతిమా, ప్రశాంతి, సాజిత, ప్రసన్నలక్ష్మి, సుభాషిణి పాల్గొన్నారు.

డ్రైవర్ హనుమంతరావు కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత

బాలానగర్, జనవరి 6 : కూకట్‌పల్లి డిపోలో డ్రైవర్ కె.హనుమంతరావు హఠాన్మరణం చెందడం వల్ల తోటి ఉద్యోగులందరూ ఆయన కుటుంబానికి బాసటగా నిలిచారు. సోమవారం డిపోకు చెందిన ఉద్యోగులందరూ కలిసి హనుమంతరావు కుటుంబానికి ఆర్థిక సాయంగా రూ. 1లక్షను డిపో మేనేజర్ డి.హరి చేతుల మీదుగా అందజేశారు. ఇదిలా ఉండగా కూకట్‌పల్లి డిపోలో హనుమంతరావు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. గతనెల 21న గుండె పోటుతో మృతి చెందాడు. దీంతో ఆయన కుటుంబం ఇంటి పెద్ద దిక్కును కోల్పోయినట్టైంది. అందుకే తోటి ఉద్యోగులు కలిసి ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ శ్రీలత, ఎంఎఫ్ రాజేశ్వరీ, వెల్ఫేర్ మెంబర్ శ్రీనివాస్, లక్ష్మి, సూపర్ వైజర్లు, సెక్యూరిటీ సిబ్బంది, మెకానిక్‌లు, ఉద్యోగులు కమలాకర్‌గౌడ్, సాయిలు, శేఖర్, ఐలయ్య, మురళీకృష్ణ, రాంరెడ్డి, రాజ్‌కుమార్. తదితరులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ శాఖ అధికారి, గుత్తేదారి వ్యవహారంపై జోరుగా చర్చ..!

దుండిగల్, జనవరి 6 : 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో 'చెత్త ఎత్తకుండానే బిల్లుల కోసం ఒత్తిడి' పేరిట సోమవారం ప్రచురించిన కథనం నిజాంపేట్ కార్పొరేషన్‌లో తీవ్రకలకలం సృష్టించింది. ఈ విషయంపైనే అటు అధికారులు, ఇటు కాంట్రాక్టర్ల మధ్యనే పొద్దంతా చర్చ నడిచినట్లు తెలుస్తోంది. అసలు సదరు ఇంజినీరింగ్ శాఖ ఉన్నతాధికారి ఎందుకోసం ఆ..గుత్తేదారి కోసం అంత వెంపర్లాడుతున్నాడు. వారిద్దరి మధ్యన ఉన్న సంబంధం ఏమిటీ..?కేవలం కాంట్రాక్టు పనులకు సంబంధించిన కమీషన్ కోసమే ఆయన అటు ప్రజాప్రతినిధులు, ఇటు ఉన్నతాధికారుల చుట్టూ తిరుగుతూ ఒత్తిడి చేశాడా ...?లేక చెత్త తరలింపు పనుల్లో ఆయనకేమైనా వాటా ఉందా.. ? అనే కోణంలో చర్చలు జరిగినట్లు తెలుస్తుంది. ఈ విషయంలో ఉన్నతాధికారులు సైతం దృష్టి సారించినట్లు తెలుస్తుంది. రెండేండ్ల క్రితం వరకు ఒక చిన్న కాంట్రాక్టర్‌గా ఉన్న సదరు గుత్తేదారు...ఇప్పుడు ఏకంగా మెజారిటీ పనులు ఎలా దక్కించుకుంటున్నాడు..?సదరు ఇంజినీరింగ్ శాఖ ఉన్నతాధికారి చలువతోనే ఇంత ఎదిగాడా ..?వీరిద్దరి కారణంగా మున్సిపల్ కార్పొరేషన్‌కు జరిగిన నష్టం ఎంత... ?అనే విభిన్న చర్చలు జరిగినట్లు తెలుస్తుంది. అయితే మున్సిపల్ కమిషనర్ సాబేర్‌ఆలీ మాత్రం ఈ విషయంలో మాట్లాడేందుకు ముందుకురాక పోవడం గమనార్హం.

ఆటోలో పరిమితికి మించి ప్రయాణికులు వద్దు

కొండాపూర్, జనవరి 6 : ఆటోలో పరిమితికి మించిన ప్రయాణికులను అనుమతించవద్దని మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ మనోజ్ అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవం-2025లో భాగంగా సోమవారం చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆర్టీవో రంగారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన చందానగర్ ఇన్‌స్పెక్టర్ పాల వెల్లితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పాసింజర్ వాహనాల్లో (టాక్సీ) పరిమితికి మించి ప్రయాణికులను అనుమతించకూడదన్నారు. ఆర్టీవో నియమాలకు విరుద్ధంగా ప్రయాణికులను అనుమతించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణం కూల్చివేత

దుండిగల్, జనవరి 6 : బాచుపల్లి మండలం రెవెన్యూ అధికారులు ఎట్టకేలకు స్పందించారు. ప్రభుత్వ భూమిలో నిర్మించిన గదులను సోమవారం తొలగించారు. అయితే కూల్చివేతలను నామమాత్రంగా చేపట్టడంతో స్థానికుల నుంచి విమర్శలు చెలరేగుతున్నాయి. బాచుపల్లి మండలం, నిజాంపేట్‌లోని సర్వేనంబర్ 105లో ప్రభుత్వభూమిని ఆక్రమించి ఓ బడా బిల్డర్ రెండు గదులను నిర్మించడంతో పాటు చుట్టూ ప్రహరీ ఏర్పాటు చేశారు. స్థానికుల ఫిర్యాదు మేరకు గతనెల 28న 'జాగా కనిపిస్తే పాగా' కథనాన్ని 'నమస్తే తెలంగాణ'లో ప్రచురించగా పక్కనే ఉన్న కొన్ని నిర్మాణాలను తొలగించిన రెవెన్యూ అధికారులు బడా బిల్డర్ నిర్మించిన గదులజోలికి వెల్లలేదు. అయితే సదరు అక్రమనిర్మాణాలను తొలగించాలని స్థానికులు పలుమార్లు తాసీల్దార్ పూలసింగ్ దృష్టికి తీసుకువెళ్లగా స్పందించిన ఆయన సదరు భూములను సర్వేచేయించారు. బడా బిల్డర్ నిర్మించిన గదులు ప్రభుత్వభూమిలో వస్తున్నట్లు సర్వేరిపోర్టులో తేలడంతో వాటిని తొలగించాలని ఆదేశించారు. దీంతో ఎట్టకేలకు రెవెన్యూ అధికారులు, సిబ్బందితో కలిసి నామమాత్రపు కూల్చివేతలు చేపట్టారు. రెండింటిలో ఒక గదిని, అందులోనూ పాక్షికంగా గోడలకు రంధ్రాలు పెట్టి మమా..!అనిపించేశారు. దీంతో స్థానికుల నుంచి తీవ్ర విమర్శలు చెలరేగుతున్నాయి. ప్రభుత్వభూమిలో నిర్మించిన గదులను పూర్తిగా తొలగించాలని కోరుతున్నారు.

ప్రభుత్వభూమిలో వెలసిన నిర్మాణాన్ని పాక్షికంగా కూల్చివేసిన అధికారులు

శేరిలింగంపల్లి మాజీ ఎమ్మెల్యే భిక్షపతి యాదవ్, గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డిల జన్మదిన వేడుకలను సోమవారం అభిమానుల సమక్షంలో గోపన్‌పల్లిలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవికుమార్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు. *– శేరిలింగంపల్లి, జనవరి 6*

కిమ్స్‌లో మమ్ టు బీ కార్నివాల్

శేరిలింగంపల్లి, జనవరి 6: రాయదుర్గంలోని కిమ్స్ కడల్స్‌లో మమ్ టు బీ కార్నివల్-2025 కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. 6 మాసాల గర్భంతో ఉన్న దాదాపు 60 మంది ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొని సందడి చేశారు. మహిళలు గర్భం దాల్చినప్పటి నుంచి ప్రసవం అయ్యేవరకు భర్తల నైతిక మద్దతు చాలా అవసరమని రాయదుర్గం కిమ్స్ కడల్స్ గైనకా లజిస్టు డాక్టర్లు డీఎస్ నిఖితారెడ్డి, కావ్యప్రియ వజ్రా ల, సాహిత బల్యూరిలు ఈ సందర్భంగా పేర్కొ న్నారు. భర్తల సహాయంతోనే సులభంగా సాధారణ ప్రసవం జరుగుతుందని తెలిపారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

బాలానగర్, జనవరి 6 : ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఫతేనగర్ కార్పొరేటర్ పండాల సతీశ్‌గౌడ్ అన్నారు. సోమవారం డివిజన్ పరిధిలోని లాల్‌బహదూర్‌శాస్త్రినగర్‌లో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెక్కాడితేగాని డొక్కాడని నిరుపేదలకు ఉచిత వైద్య శిబిరాలు ఎంతగానో దోహదపడుతాయని పేర్కొన్నారు. ఆరోగ్య సమస్యలున్న నిరుపేదలు వైద్య శిబిరాల్లో పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వైద్యశిబిరాలకు విశేష ఆదరణ లభించడం సంతోషకరం అన్నారు. కార్యక్రమం లో జాకీర్, కుతాడి రాములు, జగన్‌గౌడ్, లక్ష్మణ్, విశ్వనాథ్ పాల్గొన్నారు.

వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సతీశ్‌గౌడ్

విద్యార్థుల సౌకర్యార్థం నాలాకు ఫెన్సింగ్

స్కూల్ విద్యార్థుల సౌకర్యార్థం నాలా పక్కన ఫెన్సింగ్ పనులకు శ్రీకారం చుట్టినట్లు ఫతేనగర్ కార్పొరేటర్ పండాల సతీశ్‌గౌడ్ అన్నారు. సోమవారం ఆయన జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి గౌతంనగర్ నాలా ఫెన్సింగ్ పనులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నాలా ఫెన్సింగ్ సమస్యను పరిష్కరించేందుకు కూకట్‌పల్లి ఎమ్మెల్యే కృష్ణారావు సూచనల మేరకు జడ్సీ అపూర్వ చౌహాన్ దృష్టికి తీసుకుపోవడం వల్ల సమస్యకు పరిష్కారం లభించిందని తెలిపారు. విద్యార్థులతోపాటు గౌతంనగర్, అక్షయ్‌ఎన్‌క్లేవ్, శోభనకాలనీ, బాలానగర్, ఫతేనగర్ ప్రజలు ప్రమాదకరంగా ఉన్న నాలా పక్క నుంచి నిత్యం సంచరిస్తుండడం వల్ల నాలాకు ఫెన్సింగ్ ఏర్పాటు చేయడం హర్షణీయం అన్నారు. నాలాపై స్లాబ్‌కు కూడా నాణ్యత లోపించిందని అధికారులకు వివరించారు. నాలాకు స్లాబ్‌ను పూర్తిగా తొలగించి కొత్తగా వేయాలని కోరారు. కార్యక్రమంలో శశి, బాగయ్య, సలావుద్దీన్, ఈశ్వర్, శ్రవణ్‌గుప్తా, అబ్దుల్ మాలిక్, బషార్ పాల్గొన్నారు.

ఊరెళ్తున్నారా.. జర జాగ్రత్త..

- ఇంట్లో విలువైన వస్తువులు, డబ్బు ఉంచవద్దు..
- లైట్లు వేచి ఉంచాలి.. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోండి
- జాగ్రత్తలు తీసుకుంటేనే సేఫ్
- బాలానగర్ సీఐ నర్సింహరాజు

బాలానగర్, జనవరి 6 : సంక్రాంతికి పండుగకు ఊరెళ్లేవా రు ఇంటి వద్ద తగు జాగ్రత్తలు తీసుకోవాలని బాలానగర్ సీఐ నర్సింహరాజు సూచించారు. సోమవారం ఆయన మా ట్లాడుతూ.. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని విద్యార్థులకు సెలవులు రావడం...స్వంత ఊర్లకు వెళ్లేవా రు తమ ఇండ్ల వద్ద జాగ్రత్తలు తీసుకోకపోతే దొంగలు రెచ్చిపోయే అవకాశం ఉందని అన్నారు. ఇంటి వద్ద సీసీ కెమెరాలు ఏర్పా టు చేసుకోవాలని, పోలీసులకు సమాచా రం అందిస్తే..తమ వంతు బాధ్యతగా గస్తీని పెంచుతామని పేర్కొన్నారు. సీసీ కెమెరాలు ఉన్న ప్రాంతాల్లో దొంగతనాలు జరిగితే నేరస్తులను త్వరగా గుర్తించి పట్టుకో వడానికి అవకాశం ఉంటుందని అన్నారు. ఇంటికి తాళం వేసినప్పుడు బయటకు కనపడకుం డా కర్టెన్ వేయాలని, ఇంట్లోని బీరువా, లాకర్ తాళాలను ఇంట్లో పెట్టకుండా వెంట తీసుకుపోవాలని, ఇంటి గదిలో లైట్లు వేసి ఉంచాలని, పక్కంటివారికి సమాచారం అందించాలని , పనివారితో ఇంటి ముందు శుభ్రం చేసే విధంగా చూసుకోవాలని, బంగారు నగలు, డబ్బును ఇంట్లో ఉంచవద్దని సూచించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ